# సంపాదకీయము

పిన్నలు, పెద్దలు కలిసి ఆనందముగా జరుపుకొను దీపావళి వచ్చినది. ప్రకృతి కూడా వర్షములతో మన జలవనరులను సమృద్ధిచేయు వర్ష ఋతువునుండి, వెన్నెల రాత్రులు వెదజల్లు శరదృతువుకు స్వాగతము పలుకు కాలము వచ్చినది. పూజ్య గురుదేవులు తమ దశాదేశములలో మానవుడు ప్రకృతితో తాదాత్మ్యము చెంది నిష్కపటముతో కూడిన నిరాడంబర జీవితము గడుపవలెనని ఆదేశించినారు. దివ్యత్వము సృష్టిచేయవలెనను భావన యేర్పడినపుడు ఒక క్షోభ యేర్పడి కొంతకాలమునకు విశ్వము ఆవిర్భవించెను. ఇదే భావన మానవునిలో మనస్సుగా రూపు దిద్దుకొనెను. ఇవి రెండును సమాంతరమైనవి కావున, వాటి నడుమ సన్నిహిత సంబంధము సాధ్యపడును. ఈ సమాంతరత వలననే మానవుని మనస్సు దైవీ చైతన్యమునకు ప్రతిస్పందించును. అందువలననే మన మనసులో దైవీ భావన కలిగిన వెంటనే, ఈ విశాల సృష్టిలో మన అల్పత్వము స్ఫురణకు వచ్చి మనలో ఆ దైవీశక్తికి వినయ, విధేయతలు పొడచూపి ప్రశాంతత యేర్పడునని మన గురుదేవులు, ఒక సామాన్యునికి కూడా చక్కగా బోధపడు రీతిలో బోధించినారు. ఇంతటి గొప్ప మనస్సును, మన వ్యక్తిగత సృష్టి చేత కలుషితపరచెదము. మన మనస్సును ఒక్కసారి సావధానముతో పరిశీలించినచో అది సాధారణముగా సంక్షోభముతో నుండును. విరామ సమయములో కూడా అనేకమైన అనవసర ఆలోచనలతో మనస్సు క్షోభించుచుండును. మన ఆలోచనలు జీవముతోనుండి అవి యితరుల జీవితముపైన మరియు వాతావరణముపైన ప్రభావము చూపును. సాధారణముగా ప్రస్తుత సమాజములోని చాలామంది ఆలోచనలు పూర్తిగా యాంత్రికమై తన వ్యక్తిగత ప్రాపంచిక వున్నతికోసమే పాకులాడెదరు. ఒకవేళ తనంత తానుగా సంతోషముగానున్నా యింటిలో వున్నవారు అనవసరమైన ఆలోచనలతో అసంతృప్తితో జీవితము గడుపుతూ తమ కుటుంబ సభ్యులను మానసిక శాంతికి దూరము చేసెదరు. అనవసరమైన ఆలోచనలతో సతమతమగుచు పదేపదే వాటిని మననము చేయు స్వభావమే మనిషియొక్క బాధాతప్తమైన హృదయమునకు మరియు మానసిక కలతలకు కారణము. సాధారణముగా దీనిని అధిగమించుట కష్టము. ఇటువంటి పరిస్థితులు మనిషిని నైతికముగా దిగజార్చును. వీటి ప్రభావము వలన యింద్రియములు విచక్షణా జ్ఞానమును కోల్పోవును.

మనిషి మానసికముగా వున్నతముగా యెదగవలెననిన, తన జీవిత సమస్యను సులభముగా పరిష్కరించవలెననిన మనసుకు సరియైన సూచనలను యివ్వవలెను. అనుకూలస్య సంకల్పం ప్రతికూలస్య వర్జనం. ఇది ఆచరించగలిగిననాడు మన జీవిత సమస్య పరిష్కరింపబడును. కలుషితమైన మనసులో దైవగుణములు స్థిరపడవు. కావున మనము ఆధ్యాత్మికముగా వున్నత

స్థితులకు యెదగవలెననిన మనస్సును సంస్కరించుకొన వలెను. దీనివలన మనకేకాక తోటి వారికి కూడా మేలు చేకూరును. దీనికి శ్రీరామచంద్ర రాజయోగములోని సాధనలు మరియు ప్రాణాహుతి ద్వారా లభించు గురుదేవుల చేయూత తప్పనిసరియైనవి. భౌతిక దృక్పథమే మిక్కుటముగా గలిగిన ఈ ఆధునిక సమాజములో ప్రాణాహుతి ద్వారా దైవసహాయమును స్వీకరించిననే తప్ప, మనంతట మనము ఎన్ని సాధనలు చేసినను దైవీ గుణములను సంతరించుకొనుట అసాధ్యమని శ్రీ రామచంద్ర చైతన్య స్రవంతిలోని సాధకులకు అనుభవము. పూజ్య గురుదేవులైన శ్రీ రామచంద్రజీ మహారాజ్ వారి దివ్యకృప అందరికీ లభించి, అందరి మనసులు దైవ చింతనవైపు మరలవలెనని ప్రార్థిస్తున్నాము.

**- వి. రామం**